సీట్లు సమానం.. ఓట్లు అధికం

- బీజేపీ కంటే 10 లక్షల ఓట్లు ఎక్కువ సాధించిన కాంగ్రెస్
- రెండు పార్టీలకు చేరో 8 సీట్లు

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఆసక్తి కలిగిస్తున్నాయి. రాష్ట్రంలో రెండు జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ చెరో ఎనిమిది స్థానాలు సాధించగా, ఓట్లలో మాత్రం భారీ తేడా ఉన్నది. బీజేపీ కంటే కాంగ్రెస్ పార్టీకి 10.93 లక్షల ఓట్లు అధికంగా వచ్చాయి. సీట్లలో మాత్రం తేడా లేకపోవడం విశేషం. కాంగ్రెస్ పార్టీకి 87,40,568 ఓట్లు రాగా బీజేపీకి 76,47,064 ఓట్లు వచ్చాయి. కానీ, సీట్లు మాత్రం ఇద్దరికి సమానంగా రావడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీలతో గెలవగా, బీజేపీ అభ్యర్థులు మాత్రం తక్కువ మెజార్టీలతో విజయం సాధించారు. దీంతో బీజేపీకి తక్కువగా ఓట్లు వచ్చినట్టు అంచనా వేస్తున్నారు. బీజేపీ గెలిచిన స్థానాల్లో సైతం కాంగ్రెస్ అభ్యర్థులు రెండో స్థానంలో నిలిచారు.

36 లక్షల ఓట్లు సాధించిన బీఆర్ఎస్

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) లోక్‌సభ ఎన్నికల్లో 36 లక్షల ఓట్లను సాధించింది. రాష్ట్రంలోని 17 స్థానాలకు గాను రెండు స్థానాల్లో రెండోస్థానంలో, 14 స్థానాల్లో మూడో స్థానంలో నిలిచింది. హైదరాబాద్ స్థానంలో నాలుగో స్థానం దక్కించుకున్నది. బీఆర్ఎస్ పార్టీ 16.68 శాతం ఓట్లను పొందింది. ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల్లో రెండో స్థానంలో నిలిచింది. మిగిలిన స్థానాల్లో మూడో స్థానంలో నిలిచింది. రెండు జాతీయ పార్టీలు, అధికార పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా, విష ప్రచారంచేసినా, ఆ రెండు పార్టీలు మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకొని ఒకరికి ఒకరు సహకారంలో భాగంగా బలహీనమైన అభ్యర్థులను పెట్టుకొని బీఆర్ఎస్‌ను దెబ్బతియాలని చూశారు. అయినా ప్రజల ఆదరణ అభిమానాన్ని చురగొని, ఎన్ని ఆటంకాలు ఎదురైనా బీఆర్ఎస్ దాదాపుగా 17 శాతం ఓట్లు సాధించింది.

జాతీయ పార్టీలకే జై కొట్టిన తెలంగాణ

చెరో 8 స్థానాల్లో కాంగ్రెస్, బీజేపీ గెలుపు

రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారి జాతీయ పార్టీలకు జై కొట్టిన ప్రజలు

తెలంగాణ రాష్ట్రంపైనే ఫోకస్ చేసిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీ పెద్దలు

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఓటర్లు తొలిసారి వినూత్న తీర్పునిచ్చారు. సంపూర్ణంగా జాతీయ పార్టీలకే జై కొట్టారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి 8, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి 8 స్థానాలను కట్టబెట్టారు. ఎంఐఎం తన స్థానాన్ని నిలబెట్టుకున్నది. తెలంగాణ ప్రజలు లోక్‌సభ ఎన్నికలను బీజేపీ–కాంగ్రెస్ పార్టీల మధ్య జరుగుతున్న పోరుగానే భావించినట్టు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. రాష్ట్రం ఏర్పాటు తర్వాత జరిగిన ఎన్నికల్లో ఇలా ఏకపక్షంగా తీర్పు రావడం ఇదే తొలిసారి. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీకి రెండు దశాబ్దాల చరిత్రలో తొలిసారి ఒక్క లోక్‌సభ స్థానం కూడా దక్కలేదు. నవంబర్‌లో శాసనసభ ఎన్నికలు జరగడం, ఆ తర్వాత కేవలం నాలుగు నెలలకే లోక్‌సభ ఎన్నికలు రావడం పార్టీకి కొంత ఇబ్బందికరంగా మారింది. దీంతోపాటు రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు గతం కన్నా భిన్నంగా ఉన్నాయి. మరోవైపు ఉత్తర భారతదేశంలో సీట్లు తగ్గుతాయని భావించిన బీజేపీ పూర్తిస్థాయిలో తెలంగాణపైనే ఫోకస్ పెట్టింది. బీజేపీ అగ్రనాయకత్వం మొత్తం డిసెంబర్ నుంచి మే 13వ తేదీ వరకు పూర్తిస్థాయిలో తెలంగాణ రాజకీయాలపైనే దృష్టిసారించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం హైదరాబాద్‌కే 2–3సార్లు వచ్చి ఇక్కడే ఉన్నారు. మహబూబ్‌నగర్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ వంటి పట్టణాలకు కూడా మోదీ ప్రత్యేకంగా రావడంతో పాటు రోడ్‌షోలు కూడా నిర్వహించారు. అమిత్‌షా, జేపీ నడ్డా వంటివారు ఎన్నిసార్లు వచ్చి వెళ్లారన్నదానికి లెక్కేలేదు. వీరందరూ దృష్టిసారించడంతో ఈసారి బీజేపీ అనుకున్న స్థాయిలో సీట్లు సాధించగలిగింది.

కాంగ్రెస్ అగ్రనేతలు సైతం

కాంగ్రెస్ పార్టీ కూడా పూర్తిస్థాయిలో రాష్ట్రంపై దృష్టి పెట్టింది. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జునఖర్గే సహా ఆ పార్టీ హేమాహేమీలు ఇక్కడే తిష్టవేసి పార్టీని గెలిపించేందుకు ప్రయత్నించారు. డిసెంబర్‌లోనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ తన ఊపును కొనసాగించింది. తన పట్టును నిలుపుకోవడంతోపాటు జాతీయస్థాయిలో పార్టీకి ఉపయోగపడాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కలు కూడా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ బీఆర్ఎస్ నాయకులపైనే దృష్టిసారించాయి. రెండు పార్టీలకు కూడా సరైన అభ్యర్థులు లేకపోవడంతో బీఆర్ఎస్ పార్టీ నేతలను తమ పార్టీలో చేర్చుకొని టికెట్ ఇచ్చాయి. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కడియం కావ్య, దానం నాగేందర్, సునీతామహేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, బీజేపీ నుంచి పోటీచేసిన నాగర్ కర్నూల్ అభ్యర్థి పోతుగంటి భరత్, ఆరూరి రమేశ్, గోడెం నగేశ్, బీబీపాటిల్ వంటివారు బీఆర్ఎస్ నుంచి చివరి నిమిషంలో బీఆర్ఎస్ నుంచి ఆయా పార్టీల్లోకి మారి టికెట్ సంపాదించి పోటీ చేశారు. వీరిలో కడియం కావ్య, గోడెం నగేశ్ ఎంపీలుగా విజయం సాధించారు.

పార్టీ మారినా వరించని విజయం

- కడియం కావ్య, గోడెం నగేశ్ గెలుపు
- మిగతా నేతలందరూ పరాజితులే
- చేదు అనుభవం మిగిల్చిన ఫలితాలు

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): పార్టీలు మారి పార్లమెంటు ఎన్నికల్లో పోటీచేసిన వారిలో కడియం కావ్య, గోడెం నగేశ్ మినహా మిగిలినవారంతా ఓటమిపాలయ్యారు. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కావ్య వరంగల్ నుంచి గెలుపొందగా, బీఎస్పీ నుంచి బీజేపీలో చేరి ఆదిలాబాద్ నుంచి పోటీచేసిన గోడెం నగేశ్ విజయాన్ని అందుకున్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి జహీరాబాద్ ఎంపీగా విజయం సాధించిన బీబీ పాటిల్ ఈ ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై పోటీచేసి ఓటమిపాలయ్యారు. బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరిన ఆరూరి రమేశ్ వరంగల్ నుంచి బరిలోకి దిగి ఓడిపోగా, బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న దానం నాగేందర్ సికింద్రాబాద్ స్థానం నుంచి పోటీచేసి ఓటమి చెందారు. క్రితంసారి చేవెళ్ల స్థానం నుంచి బీఆర్ఎస్ ఎంపీగా ఎన్నికైన రంజిత్‌రెడ్డి ఈసారి కాంగ్రెస్ తరపున అదే స్థానం నుంచి పోటీచేసి ఓడిపోయారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున నాగర్‌కర్నూల్ నుంచి ఎన్నికైన రాములు ఈ ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారు. ఈసారి తన కుమారుడు భరత్‌ను అదే స్థానం నుంచి బీజేపీ తరపున బరిలో నిలిపినా ఓటమి తప్పలేదు. ఎన్నికలకు ముందు బీఎస్పీ నుంచి బీఆర్ఎస్‌లో చేరి నాగర్‌కర్నూల్ నుంచి పోటీచేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కూడా ఓటమిపాలయ్యారు. రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న సునీతా మహేందర్‌రెడ్డి ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ తరపున మల్కాజిగిరి నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన గోమాస శ్రీనివాస్ పెద్దపల్లి నుంచి పోటీచేసి ఓటమి చెందారు. బీఆర్ఎస్‌ను వీడి బీజేపీ తరపున మహబూబాబాద్ స్థానం నుంచి పోటీచేసిన సీతారాంనాయక్ ఓడిపోయారు. బీఎస్పీ నుంచి కాంగ్రెస్‌లో చేరి మెదక్ స్థానం నుంచి పోటీచేసిన నీలం మధు కూడా పరాజయం పాలయ్యారు.

ఫీనిక్స్‌లా తిరిగిలేస్తాం

పార్లమెంట్ ఫలితాలు నిరాశ పరిచాయి

ఎట్టిపరిస్థితుల్లోనూ కుంగిపోయేది లేదు

- ప్రజాసమస్యలపై పోరాడుతూనే ఉంటాం
- 24 ఏండ్లలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాం
- రెండుసార్లు ప్రభుత్వాలను ఏర్పాటుచేశాం
- రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజం
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ఎక్స్ వేదికగా మంగళవారం స్పందించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు నిరాశపరిచాయని తెలిపారు. ఫీనిక్స్ పక్షిలాగా తిరిగి లేస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ స్థాపించిన 24 ఏండ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్నో రకాల ఎత్తుపల్లాలను చూశామని గుర్తుచేశారు. అద్భుతమైన విజయాల తోపాటు అనేక ఎదురుదెబ్బలు ఎదుర్కొన్న అనుభవం పార్టీకి ఉన్నదని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీగా తమకు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడానికి మించిన గౌరవం, విజయం మరేది లేదని పేర్కొన్నారు. గతంలోనూ ఇలాంటి ఎదురుదెబ్బలు తిన్నప్పటికీ ప్రజా దరణతో బీఆర్ఎస్ పుంజుకున్న సందర్భాలెన్నో ఉన్నాయని గుర్తుచేశారు. తెలంగాణ సాధించటంతోపాటు ప్రాంతీయ పార్టీగా రెండుసార్లు అద్భుతమైన మెజార్టీ 2014 లో 63 సీట్లు, 2018లో 88 సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. ప్రస్తుత శాసనసభలోనూ మూడోవంతు సీట్లతో ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ కొనసాగుతున్నదని తెలిపారు. 'రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజమే. గెలిచినప్పుడు పొంగిపోవద్దు, ఓడినప్పుడు కుంగిపోవద్దని మా పార్టీ అధినేత కేసీఆర్ ఎప్పుడూ చెప్తుంటారు. బీఆర్ఎస్ పార్టీ అదే సిద్ధాంతాన్ని పాటిస్తుంది' అని కేటీఆర్ గుర్తుచేశారు. 'పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు కచ్చితంగా మమ్మల్ని నిరాశ పరిచాయి. అయితే, ఎట్టిపరిస్థితుల్లోనూ కుంగిపోయేది లేదు. ఎప్పటిలాగే ప్రజాసమస్యలపై పోరాడుతూనే ఉంటాం. ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వానికి వారి బాధ్యతను గుర్తుచేస్తూనే ఉంటాం. ఫలితాలతో సంబంధం లేకుండా ప్రజాక్షేత్రంలో తెలంగాణ ప్రజల తరపున పోరాడుతూనే ఉంటాం' అని చెప్పారు. తెలంగాణ ప్రజల గొంతుక బీఆర్ఎస్ అని, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పై తెలంగాణ ప్రయోజనాల కోసం అటు కేంద్రంతోనూ పోరాటం కొనసాగిస్తూనే ఉంటామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరింతగా కష్టపడి మళ్లీ ఉన్నత శిఖరాలకు చేరుకుంటామని, ఫీనిక్స్ పక్షిలాగా తిరిగి పుంజుకుంటామని కేటీఆర్ ధీమా వ్యక్తంచేశారు.

అపజయం.. అయినా ప్రజాపక్షమే

20 ఏండ్ల తరువాత ఈ సారే లోక్‌సభలో ప్రాతినిధ్యం కోల్పోయిన బీఆర్ఎస్

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్‌ను తీవ్ర నిరాశకు గురిచేశాయి. ఆ పార్టీ ఒక్క ఎంపీ సీటును కూడా గెలుచుకోలేకపోయింది. అయితే పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు తమను నిరాశకు గురిచేసినా ఎట్టి పరిస్థితుల్లో కుంగిపోబోమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. అయితే, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముందే అంచనా వేశారని పార్టీ కీలక నేతలు పేర్కొంటున్నారు. కేసీఆర్ ఫలితాలను ముందే ఊహించటం వల్లే 'గెలిచినా, గెలవకపోయినా బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల పక్షాన ఉంటది' అని వ్యాఖ్యానించారని సదరు నేత తెలిపారు. ఈ క్రమంలోనే 'దేవుడు ఇచ్చిన ఆయుష్షు ఉన్నంత వరకు, చివరి శ్వాస వరకు తెలంగాణ కోసం పనిచేస్త తప్ప, ఎట్టి పరిస్థితుల్లో విశ్రమించే ప్రసక్తేలేదు. బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ ప్రజల కోసం. తెలంగాణ ప్రజల కోసం పోరాటం చేస్తది. ఎటువంటి త్యాగాలకైనా సిద్ధపడుతది. వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు' అని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆ నేత ఉదహరిస్తున్నారు.

20 ఏండ్ల తర్వాత..

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం తర్వాత ఐదు సార్లు పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. ఇందులో ఈ ఎన్నికల్లో మాత్రమే లోక్‌సభలో బీఆర్ఎస్‌కు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. నాటి టీఆర్ఎస్ (బీఆర్ఎస్) ఆవిర్భవించిన మూడేండ్లకు (2004) వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో ఐదు స్థానాలను గెలుచుకొన్నది. పార్టీ అధినేత కేసీఆర్, ఆలె నరేంద్ర, బోయినపల్లి వినోద్‌కుమార్, రవీంద్రనాయక్, మధుసూదన్‌రెడ్డి లోక్‌సభకు ఎన్నికయ్యారు. కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకోవటం, యూపీఏ కనీస ఉమ్మడి ప్రణాళికలో తెలంగాణ అంశాన్ని చేర్చటం, రాష్ట్రపతి ప్రసంగంలో తెలంగాణ ఏర్పాటుకు అధికారిక ప్రకటన చేయించటమే పదేండ్ల తర్వాత తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి పునాది పడిందనే విషయం తెలిసిందే. ఈ తర్వాత 2009లో జరిగిన ఎన్నికల్లో ఇద్దరు (కేసీఆర్, విజయశాంతి) ఎంపీలుగా గెలిచినా తెలంగాణ ఆవిర్భవించింది. రాష్ట్ర ఏర్పాటుకు రాష్ట్రపతి ఆమోదముద్ర పడ్డాక 2014లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ 11 స్థానాల్లో విజయం సాధించింది. 2019లో 9 సీట్లు సాధించి, ఇప్పుడు మాత్రం ఒక్కసీటును కూడా సాధించకపోవటం గమనార్హం.

రాజకీయాల్లో గెలుపోటములు సహజమే

ఫలితాలపై నిరాశ చెందాల్సిన పని లేదు: మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఎంపీ ఎన్నికల ఫలితాలతో నిరాశ చెందాల్సిన పని లేదని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో మంగళవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 24 ఏండ్ల చరిత్రలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నో ఒడిదుడుకులను చూసిందని, మరెన్నో ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడిందని పేర్కొన్నారు. లక్షల మంది కార్యకర్తల ఆశీస్సులు, అభిమానంతో తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రధాన ప్రతిపక్ష పార్టీ హోదాలో నిరంతరం శ్రమిస్తామని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్నికల హామీలు అమలు చేసేలా నిలదీస్తామని హామీ ఇచ్చారు. ప్రజాతీర్పును గౌరవిస్తూ, తమని తాము సంస్కరించుకుంటూ.. భవిష్యత్తుపై సరికొత్త ఆశలతో, ఆశయాలతో ముందుకు కదులుతామని స్పష్టం చేశారు.

కిషన్‌రెడ్డి | అసదుద్దీన్ ఒవైసీ | ధర్మపురి అరవింద్ | బండి సంజయ్

మళ్లీ గెలిచిన సిట్టింగులు నలుగురే

కిషన్‌రెడ్డి, ఒవైసీ, అరవింద్, బండి ఎంపీలుగా ఎన్నిక

రాష్ట్రం నుంచి మహిళలు, యువకులు, అనుభవజ్ఞుల ప్రాతినిధ్యం

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో నలుగురు సిట్టింగ్ ఎంపీలే తిరిగి ఎన్నికయ్యారు. ఆ నలుగురిలో ముగ్గురూ బీజేపీ నుంచే గెలుపొందారు. బీజేపీ అభ్యర్థులుగా సికింద్రాబాద్ నుంచి కిషన్‌రెడ్డి, కరీంనగర్ బండి సంజయ్, నిజామాబాద్ నుంచి ధర్మపురి అరవింద్ గెలుపొందారు. హైదరాబాద్ నుంచి ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ ఎంపీగా తిరిగి విజయం సాధించారు. బీఆర్ఎస్‌కు చెందిన రంజిత్‌రెడ్డి, బీబీ పాటిల్ ఆ పార్టీని వదిలి కాంగ్రెస్, బీజేపీలోకి వెళ్లి పోటీ చేసినా ఓటమిపాలయ్యారు. మాజీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గోడెం నగేశ్, సురేశ్ షెట్కార్, బలరాం నాయక్, మల్లు రవి తిరిగి ఎంపీలు గా ఎన్నికయ్యారు. గతంలో మంత్రులుగా పనిచేసిన ఈటల రాజేందర్, డీకే అరుణ, ఎమ్మెల్యేగా పనిచేసిన రఘునందన్‌రావు లోక్‌సభకు ఎన్నికయ్యారు. చట్టసభలకు కొత్తగా ఎన్నికైనవారిలో యువ నేతలు ఉన్నారు. వ రంగల్ నుంచి కడియం కావ్య, నల్లగొండ నుంచి కుందూరు రఘువీర్‌రెడ్డి, భువనగిరి నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, పెద్దపల్లి నుంచి గడ్డం వంశీకృష్ణ ఈ లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొంది ఢిల్లీ బాటపట్టారు. రాజకీయ కుటుంబానికి చెందిన రామసహాయం రఘురామిరెడ్డి మొదటిసారిగా చట్టసభకు ఎన్నికయ్యారు.

రేవంత్‌కు పాలమూరులో ఎదురుదెబ్బ!

- సీఎం సొంత జిల్లాలో కాంగ్రెస్ ఓటమి
- ముఖ్యమంత్రిని పట్టించుకోని సొంత జిల్లా మహబూబ్‌నగర్ ఓటర్లు
- సిట్టింగ్ స్థానం మల్కాజిగిరిలోనూ హస్తం అభ్యర్థికి తప్పని పరాభవం

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డికి సొంత జిల్లాలో ఘోర పరాభవం ఎదురైంది. ఆయన జిల్లా ప్రజలే కాంగ్రెస్ పార్టీని తిరస్కరించారు. వరుస ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి పాలమూరు ప్రజలు దెబ్బ మీద దెబ్బ కొట్టారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో ఓటమి మరవకముందే.. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు ఓటమి తప్పలేదు. మహబూబ్‌నగర్ ఎంపీ స్థానంలో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన వంశీచంద్‌రెడ్డి బీజేపీ అభ్యర్థి డీకే అరుణ చేతిలో 4,500 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. దీంతో ముఖ్యమంత్రి తన సొంత జిల్లాలోనే పార్టీని గెలిపించుకోలేకపోయారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఓటమిని తప్పించలేకపోయిన రేవంత్

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించిన మొదటి అభ్యర్థి మహబూబ్‌నగర్ స్థానానికే. వంశీచంద్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అయితే బీజేపీ నుంచి డీకే అరుణను అభ్యర్థిగా ప్రకటించడంతో పోటీ తీవ్రంగా ఉంటుందని భావించిన రేవంత్‌రెడ్డి మరే నియోజకవర్గంలో నిర్వహించనన్ని బహిరంగసభలు, సమావేశాలు ఇక్కడ నిర్వహించారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా తిరిగి వచ్చి మహబూబ్‌నగర్‌లో వాలిపోయేవారు. ఇక చివరికి సెంటిమెంట్ అస్త్రం కూడా ప్రయోగించారు. ఎన్ని చేసినా.. ఓటమి నుంచి పార్టీని తప్పించలేకపోయారు.

సిట్టింగ్ స్థానంలోనూ ఎదురుదెబ్బ

సీఎం రేవంత్‌రెడ్డి.. తన సిట్టింగ్ ఎంపీ స్థానం మల్కాజిగిరిలో కూడా పార్టీని గెలిపించలేకపోయారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి స్థానం నుంచి గెలుపొందిన సంగతి తెలిసిందే. తన సిట్టింగ్ స్థానాన్ని ఎలాగైనా పార్టీకోసం నిలబెట్టాలని బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన సునితాలక్ష్మారెడ్డికి పట్టుబట్టి మరీ మల్కాజిగిరి టికెట్ ఇప్పించారు. కానీ ఇక్కడా ఆయనకు ఓటమి మహబూబ్‌నగర్, మల్కాజిగిరి రెండు స్థానాల్లోనూ బీజేపీ చేతిలోనే ఆయనకు ఓటమి ఎదురవడం గమనార్హం.

సీఎంగా రేవంత్‌ను చూడడం లేదా!

సీఎం తన సొంత జిల్లాలో కాంగ్రెస్ వరుస ఓటములపై పార్టీలో జోరుగా చర్చ జరుగుతున్నది. స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల్లో 200 ఓట్ల మెజార్టీతో గెలువబోతున్నామని రేవంత్‌రెడ్డి మొదట్లో చెప్పారు. కానీ 109 ఓట్ల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి ఘన విజయం సాధించారు. ఇప్పుడు మహబూబ్‌నగర్ ఎంపీ స్థానంలోనూ అక్కడి ప్రజలు కాంగ్రెస్‌ను పట్టించుకోలేదు. దీనిపై పార్టీలో పలు పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి. పాలమూరు ప్రజలు సీఎంగా రేవంత్‌రెడ్డిని అంగీకరించడం లేదా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నట్టు తెలిసింది. ఈ ఓటములపై సీఎం రేవంత్‌రెడ్డి ఏ విధంగా స్పందిస్తారనేది ఆసక్తిగా మారింది.

కొడంగల్‌లో మెజార్టీ నిలుపుకోని రేవంత్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డికి తన సొంత అసెంబ్లీ నియోజకవర్గంలో కూడా ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో తనకు వచ్చిన మెజార్టీని ఎంపీ ఎన్నికల్లో నిలుపుకోలేకపోయారు. అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి పోటీ చేసిన రేవంత్‌కు 32,532 ఓట్ల మెజార్టీ వచ్చింది. దీంతో ఎంపీ ఎన్నికల్లో 50 వేల ఓట్ల మెజార్టీ అందించాలని ప్రజలను కోరారు. కానీ కొడంగల్‌లో కాంగ్రెస్‌కు కేవలం 21,854 మెజార్టీ మాత్రమే వచ్చింది. దాదాపు పది వేల ఓట్లకు పైగా మెజారిటీ తగ్గిపోగా డీకే అరుణ కేవలం 4.5 వేల మెజారిటీతో గెలుపొందడం గమనార్హం.

రెఫరెండం ఏమైంది?

- ఈ ఎన్నికలు తమ పాలనకు రెఫరెండమన్న రేవంత్‌రెడ్డి
- 13 సీట్లు గెలుస్తామని ధీమా
- 8 స్థానాలకే హస్తం పరిమితం

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): 'ఈ పార్లమెంట్ ఎన్నికలను కచ్చితంగా తమ పాలనకు రెఫరెండంగా భావిస్తాం' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ప్రకటించారు. కాంగ్రెస్ ఆశించిన విధంగా విజయం సాధించలేకపోవడంతో రేవంత్‌రెడ్డి మాటపై నిలబడతారా? లేదా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ కచ్చితంగా 13 సీట్లు గెలుస్తుందని, కనీసం 10 స్థానాలైనా గెలుచుకుంటామని ఆయన పలు సందర్భాల్లో ప్రకటించారు. కానీ, ఆ పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. 8 సీట్లు గెలుచుకున్నది. సీఎం సొంత జిల్లా మహబూబ్‌నగర్‌తోపాటు ఎంపీగా తన సిట్టింగ్ స్థానం మల్కాజిగిరిలో కూడా కాంగ్రెస్ ఓడిపోయింది. అధికారంలో ఉండి కూడా ఎంపీ ఎన్నికల్లో తక్కువ సీట్లు సాధించడంపై పార్టీలో చర్చ జరుగుతున్నది. ఈ ఫలితాలు కాంగ్రెస్ పార్టీపై, ప్రభుత్వంపై ఎలాంటి ప్రభావం చూపుతాయనే అంశంపై పార్టీలో అంతర్గతంగా చర్చించుకుంటున్నారు.

ప్రజల గొంతుకై పోరాడుతాం

- బీజేపీ రాష్ట్ర చీఫ్ కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి రాష్ట్ర ప్రజలు మెజార్టీ సీట్లు కట్టబెట్టారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఎనిమిది సీట్లలో గెలిపించి మోదీని, బీజేపీని ఆశీర్వదించినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ప్రజల గొంతుకై, వారి సమస్యలపై పోరాడుతామని చెప్పారు. రాజ్యాంగాన్ని మారుస్తారని, రిజర్వేషన్లు తీసేస్తారని కాంగ్రెస్ చేసిన విష ప్రచారాన్ని తెలంగాణ ప్రజలు నమ్మలేదని చెప్పారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు నిరాశ నిస్పృహాలతో ఉన్నారని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ప్రజలకు బీజేపీ ఒక ఆశా కిరణంలా కనిపించిందని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకొనేలా అంకితభావంతో, నమ్మకంతో పనిచేస్తామని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఈ ఎన్నికలను రెఫరెండంగా భావించారని, ఆ పార్టీకి సగం సీట్లు కూడా రాలేదని, దీనిని ఏ విధంగా సమర్థించుకుంటారో చెప్పాలని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నాయకత్వంలో ఏపీలో బీజేపీ మంచి మెజార్టీ సాధించిందని, ఇందుకు ఏపీ ప్రజలకు కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ గెలుపు

13 వేల మెజారిటీతో శ్రీగణేశ్ విజయం



కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీగణేశ్

ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్లు		
	కాంగ్రెస్	53,651
	బీజేపీ	40,445
	బీఆర్ఎస్	34,462

కంటోన్మెంట్/బొల్లారం, జూన్ 4 (నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఉప ఎన్నికలో కా